


# క్రూర మృగం

వి. రాజారామ మోహనరావు

మరీ అంత హడావిడి లేకుండా కొంచెం తీరుబడిగా నడిచేటప్పుడు గోడలవేపు చూట్టం అలవాటు కృష్ణారావుకి. చాలా వూళ్ళలాగే ఆ వూళ్ళోనూ కొత్త కొత్త విశేషాలు తెలపటానికి మౌత్‌పీసుల్లా వుపయోగపడుతున్నవి గోడలే. రకరకాల రాతలతో, పోస్టర్లతో....తమ ఆధారంగా తలెత్తుకు నిలబడే బేనర్లతో ఖాళీలేకండా కనపడే గోడలవేపు చూట్టం తరచూ అసంకల్పంగా కృష్ణారావుచేసే పని.

రొటీన్‌గా పొద్దున్నే లేచి యింట్లో పనులు పూర్తిచేసుకుని ఆఫీసుకి బయలు దేరిన కృష్ణారావుకి రోజూలాగే వూళ్ళో ఆడుతున్న సినిమాలు, రాబోయే సినిమాల తాలూకు పోస్టర్లే ఎక్కువగా కనబడ్డాయి.

చాలా సినిమాలపేర్లలా ఒకేలా వున్నట్టుకనపడి చాలాసార్లు పోస్టర్లు కూడా కన్ఫ్యూజ్‌చేసాయి కృష్ణారావుని. ఒకేలా కనపడే యిలాంటివి చూసినప్పుడల్లా వో చిత్రమైన మానసికస్థితి ఏర్పడుతోంది కృష్ణారావుకి. అలాంటప్పుడు పుట్టిన ఆలోచన చిలవలు పలవలై ...'బతుకింతేనా, ఏమాత్రం మార్పులేని యీ రొటీన్ యిలా సాగాల్సిందేనా....' అనిపించే పరిస్థితి వస్తోంది.

సినిమాలమీద పెద్ద ఆసక్తి లేదు కృష్ణారావుకి. ఇంట్లో పిల్లలో, పెళ్ళామో అడిగితే తప్ప సినిమాప్రోగ్రాం పెట్టడు. సినిమా అంటే వో పది కాయితం సిద్ధం చేసుకోక తప్పదని తెలుసు. మరో దారేం లేనట్టు, యింక తప్పదన్నట్టు యీ సినిమా దృష్టి అలవాటైంది. వుత్సాహాని కైనా, నిరుత్సాహాని కైనా సినిమా కెళ్ళటమే మందులా తయారైన పద్ధతి చాలాసార్లు విసుగుతెప్పించింది. ఆ విసుగులోనే చాలాసార్లు తన చిన్నతనం గుర్తొచ్చింది కృష్ణారావుకి.

యేడాదిలో కనీసం నాలుగైదు సార్లేనా పండుగలపేరున వుత్సవాలు జరిగేవి. పెద్ద పెద్ద పందిళ్ళకింద, పైవూళ్ళనుంచి పిలిపించిన ఆర్టిస్టల ప్రోగ్రాముల్తో మంచి హడావిడిగా వుండేది. వో పందిరినుంచి మరోపందిరికి అర్ధరాత్రి దాటినా స్నేహితులు జట్లు జట్లుగా తిరగటం....ఆ ఉత్సాహం వేరు....ఆ అనుభూతి వేరు. ఇప్పుడలాంటివేం జరగటంలేదు వూళ్ళో.

రొటీన్‌గా కనపడే సినిమా పోస్టర్లనే ఆమధ్య కొన్నాళ్లూ వుత్సాహంగా చూశాడు కృష్ణారావు. దాని క్కారణం పోస్టర్ల గొప్పతనం, కొత్తదనం కాదు. సూటిగా, ప్రతిభావంతంగా, బేలన్స్ చెడకుండా కొందరు చిత్రవిచిత్రంగా కొడుతూవచ్చిన పేడముద్దలు కారణం. హీరో వో కంటిమీద కొడితే, సరిగ్గా అదే సైజులో అదేచోట హీరోయిన్ కళ్ళమీద....యిలా తూచినట్టు కనపడే ఆ పేడముద్దల్ని చూస్తే కొంతథ్రిల్లింగా వుంటూవొచ్చింది కృష్ణారావుకి. వాటిని చూసి నవ్వుకోటమే కాకుండా మనసులో ఏదో గమ్మత్తైన ఆనందం కలుగుతోందని కృష్ణారావు గ్రహింపు కొచ్చేటప్పటికి....'ఛ....ఏమిటి నా బుర్ర యిలా త యా ర వు తో ం ది' అని తనని తాను ఒకటి రెండుసార్లు తిట్టుకున్నాడు. ఆరోగ్యంగా వుండే తన ఆలోచన అనారోగ్యంగా మారుతోందా అని భయపడ్డాడు. అయినా పోస్టర్ల మీద పేడముద్దల్ని వెతికేచూపు కృష్ణారావుని వొదల్లేదు.

తమ గురిమీద బాగా గురి కుదిరిపోయో లేక వూళ్ళో పేడ, మట్టి విలువ పెరిగిపోయో మొత్తానికి కొన్నాళ్ళగా

కృష్ణారావుకి, పోస్టర్లమీద మరకలు, ముద్దలు కనిపించటం మానేశాయి. 'వాళ్ళకీ రొటీన్ అయిపోయి విసుగెత్తి వుంటుంది పాపం....' అనుకున్నాడు.

ఏదేనా జరిగితే బావుణ్ణనివుంది కృష్ణారావుకి. ఆ జరిగేది వుత్సాహంగా వుండాలి, తన పరిధిలోదే అయుండాలి. అదివిన్నాళ్ళగానో అలవాటైనఆలోచన్ని, బతుకుని అప్సెట్ చెయ్యకుండా వుండాలి. ఏ కాశ్మీరో, కన్యాకుమారో వెళ్ళొచ్చేంత ఖర్చయ్యేది కాకుండా వుండాలి.

కృష్ణారావుకే కాదు .... యిలాంటి ఆలోచన యింకా ఊళ్ళో చాలామంది కుందన్నట్టు ఆరోజు వూళ్ళో గోడ లన్నింటినీ అందంగా అలంకరించాయి ఆ పోస్టర్లు.

గొప్ప పారిశ్రామిక ప్రదర్శన

యిండస్ట్రియల్ ఎగ్జిబిషన్.

లక్షన్నర జనాభా వున్న ఆ వూళ్ళో చాలామందిలా కృష్ణారావు వో క్షణం ఆగి మరీ చూశాడు ఆ పోస్టర్లని.

* * *

ఆడవాళ్ళకి చీరలు, రోల్డుగోల్డు నగలు, పిల్లలకి వో ఒంటె, వో ఏనుగు, అయిస్క్రీమ్, పాప్కారన్, వో రంగుల రాట్నం,పిల్లలకి పెద్దవాళ్ళకీజాయింట్గా వో జైంట్వీల్, మగవాళ్ళకి ఖర్చు.... యీ సరం జామాతో ఆ ఎగ్జిబిషన్ రెండేళ్ళగా ఆవూళ్ళోకి వస్తూనే వుంది.

ఇద్దరు పిల్లలు లక్ష్మిని, రాజుని, శ్రీమతిని వెంటపెట్టుకుని కృష్ణారావు వెళ్ళాడు. తిరగాల్సిందంతా తిరిగాక కొంచం కాళ్ళు లాగినట్టనిపించాయి. కిందటి సంవత్సరం లేని వో కొత్త అయిటమ్ వొటి జతచేశారు. యీసారి పిల్లలు, శ్రీమతికూడా అది చూడాలని మొగ్గు చూపించేటప్పటికి కృష్ణారావుకి తప్పలేదు. టిక్కెట్లు కొని లోపలికి నడిచాడు.




గొయ్యితీసి చుట్టూ సిమెంట్చేసి నీళ్ళు నిండుగా పట్టిన ఆచోటు ప్రత్యేకంగా ఆ ప్రోగ్రాంకోసమే తయారు చేసినట్టుంది. వో పది పదిహేనడుగుల లోతున్నట్టుంది. జనం మరీ దానిదగ్గర కెళ్ళకుండా చుట్టూ కర్రలతో ఫెన్సింగ్లా కట్టారు. కర్రల కిటువేపు మనుషుల్ని, వెనకాల టిక్కెట్లకోసం మిగిలిన బైటి జనాభానుంచి వేరుచేస్తున్నట్టు ఎత్తుగా మేదరి తడికలు కట్టారు. నీళ్ళకి వో పక్క అయిదారు గజాలదూరంలో వంద అడుగులఎత్తు యినపనిచ్చెన, దాని మెట్లన్నీ ఎక్కాక నిలబట్టానికి వీలుగా చిన్న ప్లాట్ఫాంలా నిచ్చెన పైనా ఏర్పాటు చేశారు.

"ఆ మెట్లన్నీ ఎక్కి అంతపైనుంచి నీళ్ళల్లోకి దూకుతాడా నాన్నా...." అనడిగింది లక్ష్మి. అలా అడిగిన ఎనిమిదేళ్ళ కూతురువేపు చూశాడు కృష్ణారావు. నీళ్ళవేపు నిచ్చెనవేపు మార్చి మార్చి చూస్తోంది.

"అవునమ్మా .... ఆ పైనుంచి యీ కింద నీళ్ళలోకి దూకుతాడు...."అన్నాడు కృష్ణారావు. అప్రదర్శన రోజూ ఎనిమిదిన్నరకి ఒకసారే మూలాన్ని జనం కాసుకూచున్నట్టు చేరారు.

'అంత పైనుంచి దూకటానికి ధైర్యం కావాలి....'

'ఆ .... మనకంటే కొత్త కానీ.... అళ్ళకి మామూలే.....'

'యింకా మనిషేనా రాలేదు .... యింకెప్పుడో....'

'తొందరగా అయిపోతే బావున్ను....'

యిలా రకరకాల మాటలు వినపడుతూనే వున్నాయి. ఎనిమిదిన్నర అవబోతుంటే వో యిద్దరు వచ్చారు. అడ్డుగా కట్టిన కర్రలుదాటి నీళ్ళవేపు వొచ్చి నిలబడ్డ జనాన్ని కర్రలవెనక్కి పంపించారు. ఒకతని చేతిలో బక్కెట్టుంది. ఆ బక్కెట్టుని గట్టుకి దగ్గరగా పెట్టి నిలబడ్డాడు. మరి కాస్సేపటికి పైకెక్కి దూకే మనిషి రాకతో మళ్ళీ గోలగా మాటలు మొదలయ్యాయి. టైట్గా పట్టేసినట్టు పాంట్, జర్సీలాంటి కోటు .... చేతిలో టోపీ....మంచినీళ్ళ దగ్గరకి వెళ్ళి వోసారి చూసుకుని వెనక్కి వచ్చాడు. లైనుగా గుంపులో ముందు నిలబడ్డ వాళ్ళందరికీ షేక్ హాండ్ యిస్తూ వస్తున్నాడు. దగ్గరికి రాగానే కృష్ణారావు అప్రయత్నంగా చెయ్యికలిపాడు. అతని బట్టల్ని చూస్తూ నెమ్మదిగా తలెత్తుతున్న కృష్ణారావుని....

"మీరు .... మీరు .... కృష్ణారావే...." అతని మాట పూర్తికాకుండానే తలెత్తి చూశాడు కృష్ణారావు.

"రఘూ....నువ్వా" అన్నాడు.

"నేనే....వుండు షో. అయిపోయాక కలుద్దాం....వెళ్ళిపోకు...." అన్నాడు, ముందుకి వెళ్ళిపోతూ.

"రఘురాం....నా క్లాస్‌మేట్...." అన్నాడు కృష్ణారావు భార్యవేపు తిరిగి... చిత్రమైన కంగారుగా వుంది. రఘు తన చేయి పట్టుకుని వో నిముషం ఆగి మాట్లాట్టం గుంపులో చాలామంది చూశారన్నది తట్టేటప్పటికి తన కేదో గొప్పతనం వొచ్చినట్టనిపించింది. వోక్షణం నీళ్ళనీ రఘూనీ మానేసి చుట్టూ జనాన్ని చూశాడు కృష్ణారావు. కొంతమంది యింకా తనవేపే చూస్తున్నట్టు అనిపించింది.

గుంపుగావున్న జనంచుట్టూ తిరిగేశాక నెమ్మదిగా నిచ్చెన దగ్గరికి నడిచాడు రఘు. జనంవేపు వోసారి చెయ్యూపి నెమ్మదిగా నిచ్చెనెక్కటం మొదలెట్టాడు. అంతవరకూ ఆ మాటా యీ మాటా మాట్లాడుతున్న జనం కబుర్లాపేశారు. నిశ్శబ్దంగా వూపిరి బిగబట్టి చూస్తున్నట్టు నిలబడ్డారు. అంత అకస్మాత్తుగా ఏర్పడ్డ నిశ్శబ్దాన్ని పరీక్షిస్తున్నట్టు చుట్టూ చూశాడు కృష్ణారావు. ఇంచుమించు చాలామంది ముఖాలు వొకేలా కనిపించాయి. అది వుత్సాహమో.... ఆతృతో .... అందరి ముఖాలు వొక్కొక్క మెట్టే పైకి కదులుతున్నాయి.

రఘు పూర్తిగా పైకి ఎక్కేశాక.... పైన నిలబడి వో క్షణం చుట్టూచూశాడు. పేంట్ జేబులోంచి వో కాయితం తీసి చిన్నచిన్న ముక్కలుగా చింపి, కిందకి వొదిలి గాలివాలు చూసుకున్నాడు. చూసుకున్నాక తను రెడీ అన్నట్టు పైనుంచి చెయ్యూపాడు.

వెంటనే కింద నీళ్ళదగ్గర నిలబడ్డ అతను బకెట్టు ఎత్తి అందులో పెట్రోలు నీళ్ళల్లో పోశాడు. మరో అతను అగ్గిపుల్ల గీసి వెలిగించాడు. నీళ్ళన్నీ కాలుతున్నట్టు మంటలు పైకి లేచాయి.

రఘు పైనుంచి దూకటం, మంటలు చెదిరిపోటం....నీళ్ళల్లోంచి రఘూ పైకి రావటం అన్నీ జరగటానికి నాలుగైదు నిమిషాలకన్నా ఎక్కువసేపు పట్టలేదు.

"పైనుంచి భలే దూకాడు కదు నాన్నా...." అన్నాడు పన్నెండేళ్ళ రాజు.

అవునన్నట్టు నెమ్మదిగా తలూపాడు కృష్ణారావు.

మరో పావుగంట దాటాక, యించుమించు జనం అందరూ వెళ్ళిపోయాక రఘుతో మాట్లాట్టానికి వీలుచిక్కింది కృష్ణారావుకి.

'ఏరా' .... అంటే 'ఏరా' అనుకున్నారు. ఎక్కువగా మాట్లాడుకోటానికి వీలుదొరక్కపోయినా గబగబా చాలా మాటలు మాట్లాడుకున్నారు.

* * *

మర్నాడు పొద్దున్నించీ పనిగట్టుకుని చుట్టుపక్కల అందరి యిళ్ళకీ వెళ్ళి మరీ చెప్పారు రాజూ, లక్ష్మి....'ఎగ్జిబిషన్‌లో పైనుంచి కింద నీళ్ళల్లోకి దూకే అంకుల్ .... యీ రోజు మా యింటికి వస్తాడని'....

రఘూ వొచ్చి పదినిముషాలు గడవకుండానే కృష్ణారావింటి ముందు ఆడ, మగ వో పదిపదిహేను మంది చేరారు.

'మా మూ లు గా మ న లా గే వున్నాడు....'

'పైకెక్కి....కింద నిప్పుపెట్టిన నీళ్ళల్లోకి దూకుతాడంట.'

ఇలా రకరకాల కబుర్లు....చూసిన వాళ్ళు వెడుతుంటే కొత్తవాళ్ళు వస్తున్నారు. ఇంక వాళ్ళ బాధ పళ్ళేక కృష్ణారావు వీధితలుపు వేసేశాడు.

రఘూని ముందుగదిలోంచి లోపలి గదిలోకి తీసికెళ్లాడు.

"నిన్న సినిమా హీరోలా చాటుగా కూచోబెట్టాల్సి వచ్చేటట్టుంది ...." అన్నాడు కృష్ణారావు నవ్వుతూ.

రఘూకూడా నవ్వాడు. నవ్వి.... "అసలు నేను ఫలానా అని....యిక్కడికి వస్తున్నానని వీళ్ళందరికీ ఎవరు చెప్పారు....నువ్వేనా...." అన్నాడు.

"అబ్బే నేకాదు .... యీ పబ్లిసిటీ అంతా యిచ్చింది వీళ్లు ...." అని పిల్లల్నిద్దర్నీ చూపించాడు కృష్ణారావు. రాజునీ లక్ష్మినీ నవ్వుతూ దగ్గరికి తీసుకున్నాడు రఘు.

మధ్యలో తనూ మాట్లాడినా, పిల్లల్తో వోపిగ్గా కబుర్లు చెబుతున్న రఘూనే చాలాసేపు చూస్తూ కూచున్నాడు కృష్ణారావు.

చదువుకునే రోజుల్లో ప్రతి చిన్న విషయానికీ విసుక్కునే రఘుతీరు గుర్తొచ్చింది. 'ఏపని చెయ్యాలన్నా ఎంత బద్ధకంగా వుండేవాడో....అలాంటి వాడికి ఎంత వోపికొచ్చింది....' అనుకున్నాడు కృష్ణారావు. పిల్లలడిగిన వాటన్నింటికీ ఏమాత్రం విసుగులేకుండా కబుర్లు చెపుతున్న రఘూని చూస్తూ అదే అన్నాడు. "నీకింత వోపికెలా వొచ్చిందిరా...." అని.

"వోపికేక్కముందిరా....అవసరమైతే అన్నీ వస్తాయి. ఇంకా నీకింత ధైర్యం ఎలా వొచ్చిందిరా....అని అడుగుతావేమో అనుకున్నాను" అన్నాడు రఘూ.

కృష్ణారావు మనసులో అదీ వుంది. అంత ఎత్తునుంచి, అలా మంటల్లోకి దూకే ధైర్యం తనతోపాటే చదువుకుని, తనలాగే పెరిగిన రఘూకి ఎలావచ్చిందా అని.

"యీ వోపికా ధైర్యం నా కృషివల్ల వచ్చినవేంకావు .... జీవితావసరం వల్ల వచ్చినవి. చాలారోజులు సరైన ఏ

వుద్యోగం దొరకలేదు.... నానా యాతనా పడ్డాక చివరికి యిలా నడుస్తోంది బండి...." అన్నాడు రఘూ.

పిల్లలు రఘూని వొదిలిన కాస్త సమయంలో యిద్దరి సంసారాల గురించి మాట్లాడుకున్నారు స్నేహితు లిద్దరూ. యిరవై ఏళ్ళ తరవాత తిరిగి యిద్దరి కలయిక .... ఎన్నో రకాల కబుర్లు .... ఎన్నో గతస్మృతులు.

రఘూ ఎసెల్సీయేనా పూర్తి కాకుండా ఏ వుద్యోగం రాకుండా, ముసలాళ్ళు చాదస్తంతో రఘు పెళ్ళి ఆ రోజుల్లోనే జరిపించెయ్యటం కృష్ణారావు ఎరిగున్నదే. మిగిలిన సంగతులు రఘూ చెప్పాడు.

"అయితే వీళ్ళు నెలకి నీకు మూడొందలేనన్నమాట యిచ్చేది...." అన్నాడు కృష్ణారావు.

"అంతే .... అదేనా ప్రోగ్రాంస్ వున్నరోజుల్లో.... నెలకి మూడొందలు, రోజూ బేటా యిస్తారు.... ప్రోగ్రాములు లేనప్పుడు నెలకి రెండొందలే యిచ్చేది...." అన్నాడు రఘు.

ఇద్దరి జీవితాలపోలిక అప్రయత్నంగానే కృష్ణారావు మనసులో మెదిలింది. 'చాలా రిస్కు వున్న లైఫ్ రఘూది....' అనుకున్నాడు. ఆలోచన మరింత ముందుకు సాగబోతుంటే తుఫానులా.... "అంకుల్ .... అంకుల్ ...." అంటూ పరిగెత్తుకొచ్చారు పిల్లలు.

తిరిగి వాళ్ళ కబుర్లు మొదలయ్యాయి. భోజనాలకి కూచునేవరకు పిల్లలు ఏవో అడుగుతూనే వున్నారు. రఘు చెపుతూనే వున్నాడు. కృష్ణారావుకే విసుగొచ్చి .... "వూరుకోండర్రా.... ఏమిటి వూరికే వాగుడు ...." అని మధ్యలో ఒకటిరెండుసార్లు కేకలేశాడు.

"మాట్లాడనివ్వరా .... పిల్లలు .... పెద్దయితే ఎలాగా యిన్ని మాటలు మాట్లాడనే మాట్లాడరు...." అని రఘు అనటంతో పిల్లలిద్దరూ కృష్ణారావు మాటని ఖాతరు చెయ్యలేదు.

స్కూలు .... చదువు, టీచర్లు, హోమ్ వర్కు యిలా వాళ్ళ కబుర్లు ఒకదాని మించి మరొదానిమీదకి భోజనాలవుతున్నా సాగుతూనే వున్నాయి. నెమ్మదిగా కబుర్లు సినిమాలమీదకి మళ్ళాయి.

"అప్పుడు వో సినిమా చూశాం అంకుల్ .... అందులో సర్కస్ కూడా వుంది...." అంది లక్ష్మి.


తెలిసున్నవే అయినా తెలియని విషయం వింటున్నంత శ్రద్ధగా వింటున్న రఘూని చూస్తుంటే వాళ్ళకి మంచి వుత్సాహంగా వుంది.

"ఆ సర్కస్‌లో వో అబ్బాయి సింహాల్ని భలేగా ఆడించాడు అంకుల్." అన్నాడు రాజు.

రాజు వేపు తల తిప్పి 'అహా' అన్నట్టు తలూపాడు రఘూ.

"అంకుల్ .... సింహం అన్నిటికన్నా క్రూయల్ యానిమల్ కదూ...." అంది లక్ష్మి.

రఘూ తిరిగి లక్ష్మివేపు తిరిగాడు. పిల్లలు అక్కుండా అన్ని కబుర్లు చెపుతుంటే కృష్ణారావుకి ఆశ్చర్యంగా వుంది. రఘూ లక్ష్మికి సమాధానంచెప్పే లోపే రాజు.... "ఏంకాదు.... అన్నింటికన్నా టైగరే క్రూయల్ ...." అన్నాడు




సింహమని లక్ష్మి.... టైగర్ అని రాజు గొడవ గొడవగా మాట్లాడారు. కృష్ణారావుకి సందేహం వొచ్చింది. 'ఏది క్రూయల్ ....' అని. ఆ సందేహం తీరకుండానే కృష్ణారావు భార్య చేయి జారి పులుసు గిన్నె కింద పట్టంతో కంచాలు సద్దుకోటంలో ఆ సంభాషణ ఆగిపోయింది.

'అయ్యో పులుసంతా పోయిందని...' కృష్ణారావు భార్య బాధపట్టం.... పరవా లేదని రఘూ, కృష్ణారావు చెప్పటం వీటితో సరిపోయింది కాస్సేపు.

సాయంత్రం వెళ్ళేవరకూ పిల్లల్ని రఘూ వొదల్లేదు.... పిల్లలు రఘూనీ వొదల్లేదు. అది చూసి .... "పెదవకి పిల్లల్లేరుకదూ.... ఆపేక్ష...." అన్నాడు కృష్ణారావు భార్యతో....

* * *

వారం గడిచేలోపు మరో రెండుసార్లు ఎగ్జిబిషన్‌కి వెళ్ళొచ్చారు కృష్ణారావు కుటుంబం. రఘూ వుండటంవల్ల టిక్కెట్ల బెడద లేదు. వెళ్ళిన రెండుసార్లుకూడా రఘూ అయిటమ్ చూసి అది పూర్తి అయ్యాకే తిరిగి వొచ్చారు.

పైకి ఎక్కి రఘూ దూకుతున్నప్పుడు వుత్సాహంకన్నా ఒక్కో క్షణంలో భయమే ఎక్కువవేసింది కృష్ణారావుకి. ఆ అయిటమ్ చూట్టంలో పిల్లలకి

క్రమేపి అంత వుత్సాహం వుండటం లేదని కృష్ణారావుకి తెలుస్తూనేవుంది.

'నాది.... నాకు సంబంధించింది....' అన్న భావన ఎంత చిత్రమైంది అనుకున్నాడు కృష్ణారావు తన మనసులో భయం మెదిలినప్పుడల్లా.

ఆ తర్వాత వారంలో వీలుకుదరక, కొంత, వుత్సాహంలేక కొంత తిరిగి ఎగ్జిబిషన్‌కి వెళ్ళలేదు కృష్ణారావు. రఘూ యిచ్చే ప్రదర్శనకన్నా, ఆ ప్రదర్శన చూసేటప్పుడు వాకేలా చిత్రమైన ఆతృతతో బిగుసుకుపోయినట్టు కనిపించే జనం ముఖాలే ఎక్కువ కళ్ళముందు మెదిలాయి కృష్ణారావుకి.

ఇదే కాకపోయినా, యిలాగే నూతిలో మోటారుసైకిల్ .... మామూలు సైకిల్ తొక్కేవాళ్ళు, రోడ్డుమీద మంటల యినపరింగుల్లోంచి దూకేవాళ్ళు....తాడు మీద నడిచేవాళ్ళు....పీకవరకూ భూమిలో కప్పెట్టుకుని తల్లకిందులుగా నిలబడి ఫీట్ చేసేవాళ్ళు .... యిలాంటివి గతంలో చాలా చూశాడు. కానీ అలా చేసేవాళ్ళలో తనవాడూ.... తనకి దగ్గరవాడూ ఎవరూ లేకపోటంతో ఆలోచన యింత ఎక్కువగా ఎప్పుడూ వాటి విషయంలో సాగలేదు.

* * *

మొదటాట సినిమా వొదిలిపెట్టిన టైము. అసలే రెండు సినిమాహాళ్ళకి దగ్గరగా వున్న సెంటర్ హడావిడిగా వుంది. దానికితోడు ఆ వార్త మరింత సందడి పుట్టించింది. ఆ మాట చెవిని పడేటప్పటికి కృష్ణారావుకి చెమటలు పట్టినట్టయింది.

గంట క్రితం ప్రదర్శన యిస్తూ పైనుంచి దూకినప్పుడు నీటిలో కాకుండా రఘూ గట్టుమీద పడ్డాడని....తల బద్దలై చాలా ప్రమాదంగా వుందనీ. పెద్దాస్పత్రిలో చేర్చారని కలగాపులగంగా అందరి కబుర్లవల్లా తెలిసింది. వెంటనే కంగారుగా రిక్షా పిలిచి పెద్దాస్పత్రికి బైలుదేరాడు.

ఆస్పత్రి దగ్గరికి చాలామంది జనం వచ్చి వుంటారనుకున్న కృష్ణారావు ఆలోచన తల్లకిందులైంది. ఆ షోకి సంబంధించిన యిద్దరు మనుషులుకన్నా ఎవరూ రాలేదు. వాళ్ళనే అడిగాడు రఘూ ఎలా వున్నాడని.

"లోపలికి తీసికెళ్ళి గంటపైనే అయింది....యింకా ఏం చెప్పలేదు...." అన్నారు.

మరి కాస్సేపటికి ఆపరేషన్ చేస్తున్నట్టు తెలిసింది.

ఇంటికి వెళ్ళాలేక, అక్కడ ఆ ఆతృతతో వుండాలేక నరకంలా గడిచింది ఆ రాత్రి కృష్ణారావుకి.

తెల్లారి ఎనిమిదింటికి రఘూని చూపించటానికి వొప్పుకున్నారు డాక్టర్లు.

తలకేకాదు .... వొంటిమీద చాలా చోట్ల కట్లున్నాయి రఘూకి. ఆ స్థితిలో రఘూని చూస్తుంటే .... గొంతు దాటి పైకి రాలేని బాధ .... ఎవరితోనూ ఏమీ చెప్పుకోలేని వ్యథ కృష్ణారావుకి కళ్ళు తిరిగేలా చేసాయి. ఇంక అలా స్పృహ లేకుండా కొనవూపిరున్న శవంలా పడున్న రఘూని చూళ్ళేక బైటికొచ్చేశాడు.

చాలా రక్తం పోయిందని....ఎముకలు చాలాచోట్ల విరిగాయని, ఆపరేషన్ బాగానే జరిగిందని....బ్లడ్ యిస్తున్నామని యిలా డాక్టర్లు చెప్పిన రకరకాల మాటలు కృష్ణారావు చెవిని పడ్డాయి.

వినపడ్డా ఆ మాటలు మనసువరకూ వెళ్ళలేదు. ఆలోచనా, చైతన్యం కోల్పోయినట్టుంది కృష్ణారావుకి.

తొమ్మిది దాటాక రఘూ చచ్చిపోయాడన్న వార్త హాస్పిటల్ వరండాలోకి వచ్చింది. యంత్రంలా లేచి వెళ్ళి శవాన్ని మిగిలిన నలుగురితోపాటు చూశాడు కృష్ణారావు.

చిన్నతనం....రఘూతో కలిసి తిరిగిన వుత్సవాల పందిళ్ళు కళ్ళముందు లీలగా కదిలాయికృష్ణారావుకి.రాజూ, లక్ష్మిలతో వోపిగ్గా కబుర్లు చెప్పిన స్నేహితుడి కబుర్లు వినిపించాయి .... ఎగ్జిబిషన్ .... నీళ్ళు, నిచ్చెనా గుర్తొచ్చాయి.

హాస్పిటల్‌నుంచి తిరిగొస్తున్న కృష్ణారావుకి వికారంగా, ఆలోచన గజిబిజిగా పిచ్చెక్కినట్టుంది.

బోర్ .... రొటీన్ .... పేడ ముద్దలు యిలా రకరకాల ఆలోచన లొస్తున్నాయి. రఘూ గుర్తొస్తున్నాడు. రఘూ నవ్వు గుర్తొస్తోంది....పిల్లలతో రఘూమాటలు గుర్తొస్తున్నాయి. దారుణమైన రఘూ చావు గుర్తొస్తోంది. వీటితోపాటు గుర్తుగా తెలియందేదో తనని కమ్ముకున్నట్టుంది కృష్ణారావుకి.

హఠాత్తుగా గుర్తొచ్చిందికృష్ణారావుకి. 'అవును క్రూయల్ .... యిది క్రూయలే.. చావు బతుకుల అంచులమీద తోటి మనిషినిచూసి ఆనందించటం. థ్రిల్ ఫీలవ్వటం నిజంగా క్రూయల్టీయే.అయితే సింహం, పెద్దపులికన్నా....' . ఆలోచన తెగిపోయింది కృష్ణారావుకి.

ఎన్నో ఏళ్ళుగా తెలిసీ తెలియకుండా చెలామణీ అవుతూ వస్తున్న గుణాన్ని గుర్తుగా చూట్టానికి.... వికృత వినోదాలు చూట్టానికి అలవాటుపడ్డ క్రూరమృగాన్ని తనలోనే గుర్తించటానికి భయంవేసింది కృష్ణారావుకి.

•••• •••• ••••